సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

గురువారం । 15 । ఫిబ్రవరి । 2024



చలి చంపేస్తోంది
మన్యంలో మంచు ప్రభావం తగ్గుతున్నా చలిగాలుల తీవ్రత తగ్గడం లేదు. కనిష్ట ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి. 8లో



ఘనంగా జలాభిషేకం
విశాఖ: దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం భక్తులు స్వహస్తాలతో జలాభిషేకం నిర్వహించారు.



రైతుల శ్రేయస్సే లక్ష్యం!
విశాఖ: రైతులకు తోడ్పాటు అందించేలా జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తోంది. 8లో

న్యూస్‌రీల్

ఎమ్మెల్యేలతో పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి భేటీ


కురుపాం ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి, పరీక్షిత్‌రాజ్ దంపతులతో భాగ్యలక్ష్మి

సాక్షి, పాడేరు: అరకు పార్లమెంట్ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి బుధవారం అరకు పార్లమెంట్ పరిధిలోని పలువురు ఎమ్మెల్యేలను కలిశారు.మాజీ ఉప ముఖ్యమంత్రి, కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి, పార్వతీపురం మన్యం జిల్లా పార్టీ అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజ్,పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు,పాలకొండ ఎమ్మెల్యే కళావతి,ఎమ్మెల్సీ విక్రాంత్‌బాబును ఆమె కలిశారు. వారికి పుష్పగుచ్ఛాలు అందజేశారు. వారిని శాలువాలతో సత్కరించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పరిస్థితులపై వారితో భాగ్యలక్ష్మి సమీక్షించారు.

అనారోగ్యంతో విద్యార్థిని మృతి


కనకమ్మ (ఫైల్)

ముంచంగిపుట్టు: మండలంలోని దొడిపుట్టు పంచాయతీ అడాల్‌పుట్టుకు చెందిన విద్యార్థిని గోల్లోరి కనకమ్మ(13) అనారోగ్యంతో మృతి చెందింది. పాడేరులోని ఏకలవ్య బాలిక పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న ఆమె రెండు నెలలుగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ నెల 12వ తేదీన ఆమె ఆరోగ్యం విషమంగా మారడంతో వెంటనే ఆమె పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆరోగ్య పరిస్థితి మరింత విషమంగా మారడంతో కేజీహెచ్‌కు తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ పొందుతూ మంగళవారం మృతి చెందింది. బుధవారం ఆమె మృతదేహాన్ని కేజీహెచ్ అంబులెన్సులో స్వగ్రామానికి తీసుకువచ్చారు. కనకమ్మ మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షల తనిఖీ


తనిఖీ చేస్తున్న అప్పలరాము

రాజవొమ్మంగి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం జరిగిన ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలను డీఐఈవో అప్పలరాము బుధవారం ఆకస్మికంగా పరిశీలించారు. పరీక్షా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనిచేస్తున్నది లేనిది ఆయన తెలుసుకున్నారు. స్థానిక గిరిజన సంక్షేమ బాలికల గురుకుల జూనియర్ కళాశాలను కూడా ఆయన తనిఖీ చేశారు. ప్రాక్టికల్ పరీక్షలను పరిశీలించారు.

రాజరాజేశ్వరి ఆలయ నిర్మాణానికి భూమి పూజ


భూమి పూజ చేస్తున్న సింహాచలం నాయుడు దంపతులు

సాక్షి,పాడేరు: పట్టణంలోని ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో రాజరాజేశ్వరి ఆలయ నిర్మాణానికి బుధవారం భూమి పూజ నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కొట్టగుల్లి సింహాచలంనాయుడు, రమాదేవి దంపతులు, పాడేరు సర్పంచ్ కొట్టగుల్లి ఉషారాణి,ఎంఈవో సరస్వతి,కుర్తాడ రామరావు దంపతులతో ప్రత్యేక పూజలు చేశారు. పట్టణానికి చెందిన చెందిన బొజ్జా వీరరాఘవులు, కృష్ణవేణి దంపతులు ఆలయ నిర్మాణానికి రూ.50,126లు విరాళంగా అందజేశారు. ప్రధాన అర్చకులు రామంపంతులు, ఆలయ ఆధ్యాత్మిక కమిటీ ప్రతినిధులు ఉప్పల వెంకటరత్నం,కొట్టగుల్లి రామారావు, పోతురాజు, వంచెన్న రాజుబాబు, పలాసి బాలన్న, దాసరి నాగు, ప్రభాకర్, ఈశ్వరమ్మ, పద్మవేణి పాల్గొన్నారు.

నేడు సహస్ర తులసీదళార్చన

దాబాగార్డెన్స్ (విశాఖ) : కనకమహాలక్ష్మి దేవాలయంలో గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. భక్తులు వివరాలు 8985515989కు వాట్సప్ చేయాలి.

జీడిమామిడి రైతుకు

జీసీసీ భరోసా

ఏ పంట ఉత్పత్తికైనా విలువను జోడిస్తే ఆదాయం పెరుగుతుంది. ఈ దిశగా ఆలోచిస్తున్న గిరిజన సహకార సంస్థ జీడిమామిడి పిక్కలను ప్రాసెసింగ్ చేయడం ద్వారా వాటి విలువ పెంచేందుకు కసరత్తు మొదలుపెట్టింది. దీనిలో భాగంగా కొయ్యూరు మండలంలో యూనిట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని ఆ సంస్థ ఎండీ సురేష్‌కుమార్ వెల్లడించారు. సొంతంగా ఏర్పాటుచేసుకునే రైతులు/ రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు కేంద్ర ప్రభుత్వం కూడా 35 శాతం రాయితీ ఇస్తోందని జిల్లా ఉద్యానవనశాఖ తెలిపింది.

- కొయ్యూరు మండలంలో ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు ముందుకు వచ్చిన సంస్థ
- ఒకొక్క దానికి రూ.8 లక్షల నుంచి రూ.9 లక్షలు
- పెట్టుబడిగా యూనిట్‌కు రూ.లక్ష
- ప్రకటించిన ఎండీ సురేష్‌కుమార్
- యూనిట్ వ్యయంలో 35 శాతం రాయితీ ఇస్తామంటున్న ఉద్యానవనశాఖ


మహిళలతో మాట్లాడుతున్న జీసీసీ ఎండీ సురేష్‌కుమార్ (ఫైల్)

కొయ్యూరు: జిల్లాలో పోడు, మెట్ట భూముల్లో జీడిమామిడి సుమారు 62 వేల సాగవుతోంది. ఇందులో 28 వేల ఎకరాల్లో తోటలు కొయ్యూరు మండలంలో విస్తరించి ఉన్నాయి. సుమారు 23 వేల మంది రైతులు ఆధారపడ్డారు. వీరంతా వ్యాపారులు నిర్ణయించిన ధరకే విక్రయించాల్సి వస్తోంది. దీనిమూలంగా ఆర్థికంగా నష్టపోతున్నారు. నేరుగా జీడిమామిడి పిక్కలు విక్రయించే కన్నా ప్రాసెసింగ్ చేసి విక్రయించడం ద్వారా మంచి ఆదాయం పొందవచ్చు. పరోక్షంగా వ్యాపారుల దోపిడీకి చెక్ పెట్టి రైతుల ఆర్థిక పరిస్థితికి బాటలు వేయవచ్చని గిరిజన సహకార సంస్థ యోచిస్తోంది.

కార్యాచరణ సిద్ధం

ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు అయ్యే ఖర్చును భరించేందుకు కార్యాచరణ రూపొందించింది. దీని వల్ల రైతులకు ఆదాయం మెరుగుపడటమే కాకుండా పరిసర ప్రాంతాల మహిళలకు ఏడాదిలో సుమారు మూడు నుంచి నాలుగు నెలల వరకు ఉపాధి అందుబాటులో ఉంటుంది. మార్కెటింగ్ బాధ్యత కూడా జీసీసీ భుజస్కంధాలపై వేసుకుంటోంది. అప్పటి మార్కెట్ ధరను అనుసరించి రైతులకు చెల్లిస్తుంది.

పండ్లతో ఉప ఉత్పత్తులు

జీడిమామిడి ఉత్పత్తుల్లో ఇప్పటివరకు పిక్కలను మాత్రమే విక్రయించి, పండ్లను వృథాగా వదిలేస్తున్నారు. వీటిని కూడా వినియోగంలో తేవాలన్న ఆలోచనతో జీసీసీ ఉంది. జీడి పండ్ల ద్వారా 23 రకాల ఉప ఉత్పత్తులు తయారు చేసే అవకాశం ఉన్నందున ఈ దిశగా చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంతానికి వచ్చిన కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను రైతులు కోరారు. ఈ దిశగా చర్యలు తీసుకోవాలని ఆయన గిరిజన సహకార సంస్థకు లేఖ రాశారు. ఇది కూడా కార్యరూపం దాల్చితే రైతులకు మెరుగైన ఆదాయం లభించడంతోపాటు ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తాయని స్థానికులు ఆశిస్తున్నారు.


కాపు దశలో జీడిమామిడి

ఐదు యూనిట్ల ఏర్పాటుకు..

కొయ్యూరు మండలంలో ఐదు ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు గిరిజన సహకార సంస్థ సన్నాహాలు చేస్తోంది. ఇందుకు ఒకొక్క యూనిట్‌కు రూ.8 నుంచి రూ.9 లక్షల వరకు భరించనుంది. అంతేకాకుండా జీడి పిక్కల కొనుగోళ్లకు సంబంధించి ఒకొక్క యూనిట్‌కు రుణ రూపంలో పెట్టుబడి రూ. లక్ష ఇస్తామని ఇప్పటికే జీసీసీ యాజమాన్యం ప్రకటించింది.

దళారుల దోపిడీ తగ్గుతుంది



జీడిపిక్కలను ప్రాసెసింగ్ చేసే యూనిట్లు ఏర్పాటు వల్ల దళారుల బాధ తప్పుతుంది. మహిళలకు ఉపాధి దొరకుతుంది. వృథా వదిలేస్తున్న జీడిమామిడి పండ్లను వినియోగంలోకి తెస్తే రైతులకు ఆదాయం మెరుగుపడుతుంది. ఇవి ఏర్పాటైతే రైతులకు మంచి రోజులు వచ్చినట్టే. – కనకరాజు, జీడిమామిడి రైతు, కొయ్యూరు మండలం

35 శాతం సబ్సిడీ



ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం 35 శాతం రాయితీని పీఎంఎస్ బీవైలో ఇస్తుంది. యూనిట్ విలువలో రైతు లేదా రైతు ఉత్పత్తి గ్రూపులు పది శాతం చెల్లించాలి. మిగిలిన 55 శాతం బ్యాంకులు రుణంగా చెల్లిస్తాయి. దీనిపై అవగాహన కల్పిస్తున్నాం. – ఎ.రమేష్ కుమార్, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి, పాడేరు

మహిళలకు ఉపాధి



ఉపాధి పొందేందుకు జీడిమామిడి ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలని మహిళలు అడుగుతున్నారు. ఇందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. జీడి పండ్ల ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు అంశాన్ని పరిశీలిస్తున్నాం. ప్రాసెసింగ్ చేసిన తరువాత జీడిపప్పును జీసీసీ మార్కెటింగ్ చేస్తుంది. – జి. సురేష్‌కుమార్, ఎండీ, గిరిజన సహకార సంస్థ

కొత్త కలెక్టర్‌గా విజయ సునీత



సాక్షి,పాడేరు: జిల్లా కలెక్టర్‌గా ఎం.విజయ సునీతను ప్రభుత్వం నియమించింది. పౌరసరఫరాల శాఖ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఆమెను కలెక్టర్‌గా ప్రభుత్వం బదిలీ చేసింది. 2014 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఈమె గతంలో శ్రీకాకుళం జాయింట్ కలెక్టర్‌గా పని చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా ఏర్పడిన తరువాత రెండవ కలెక్టర్‌గా ఆమె బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రస్తుత కలెక్టర్ సుమిత్ కుమార్‌ను పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్‌గా బదిలీ చేసింది.

ప్రజలతో మమేకం..

పాలనలో ప్రత్యేకం


గోదావరి ముంపు గ్రామాలకు పడవపై వెళ్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్ (ఫైల్)


కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను అభినందిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి (ఫైల్)

- అభివృద్ధిలో తనదైన ముద్ర వేసుకున్న కలెక్టర్ సుమిత్‌కుమార్
- పశ్చిమ గోదావరి జిల్లాకు బదిలీ

సాక్షి,పాడేరు: పాడేరు కేంద్రంగా 2022లో ఏర్పడిన అల్లూరి సీతారామరాజు జిల్లా తొలి కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సుమిత్‌కుమార్ పాలనలో తనదైన ముద్ర వేసుకున్నారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా గిరిజన ప్రాంత ప్రధాన సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించారు. 2022, 2023 గోదావరి వరదలు సంభవించినప్పుడు విలీన మండలాల్లో ఉంటూ బాధితులకు బాసటగా నిలిచారు. వారితో మమేకమై సేవలందించారు. పరిస్థితి చక్కబడే వరకు అక్కడే ఉన్నారు. అప్పటిలో వరద బాధితులను పరామర్శించేందుకు వచ్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కూడా ఆయన సేవలను ప్రశంసించి అభినందించారు. రాష్ట్రంలో 22 మండలాలతో ఆవిర్భవించిన అతిపెద్ద జిల్లాలో ఆయన విస్తృతంగా పర్యటించారు. సెల్ టవర్ల వేగవంతానికి ఆయన విశేష కృషి చేశారు. ప్రభుత్వ వైద్యం, పౌష్టికాహారాన్ని చేరువ చేసి మాతా శిశు మరణాలకు అడ్డుకట్ట వేయగలిగారు. వైద్య ఆరోగ్య కార్యక్రమాలను మారుమూల గ్రామాలకు సైతం తీసుకువెళ్లి గిరిజనుల అభిమానాన్ని పొందారు. జిల్లాలో వ్యాధులు, రోగాలకు ప్రధాన సమస్య అయిన తాగునీటి వ్యవస్థను మెరుగుపరిచారు. దీనిలో భాగంగా జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయిలు అందుబాటులోకి వచ్చేలా పనులు వేగవంతం చేశారు. రవాణా వ్యవస్థ మెరుగుకు చర్యలు తీసుకున్నారు. పాడేరు జిల్లా ఆస్పత్రితోపాటు చింతూరు, రంపచోడవరం, అరకు ఆస్పత్రుల్లో కూడా వైద్య నిపుణుల నియామకంతోపాటు శస్త్ర చికిత్సలను అందుబాటులోకి తెచ్చారు. రిఫరల్ కేసులు తగ్గించారు. పాడేరు డివిజన్‌లో కాఫీ రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో కీలకపాత్ర పోషించారు. మిరియం రైతులకు మెరుగైన ధర కల్పించేలా కార్యాచరణ రూపొందించారు.

చేయాల్సింది ఎంతో ఉంది..

కొత్తగా ఏర్పడిన జిల్లాకు ఇంకా ఎంతో చేయాల్సి ఉంది. గోదావరి వరదల సమయంలో ప్రాణనష్టం లేకుండా అధికారుల సహకారంతో చర్యలు తీసుకోగలిగాం. విద్యావ్యవస్థకు సంబంధించి టెన్త్, ఇంటర్లో మంచి ఫలితాలు సాధించాం . వైద్యసేవలు విస్తృత పరిచాం. ప్రభుత్వం కూడా గిరిజన ప్రాంత అభివృద్ధికి, మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమైన సహకారం అందిస్తోంది. ఇప్పటికే చాలా గ్రామాలకు రోడ్డు అనుసంధానం చేశాం. అయితే బదిలీ సహజం. – సుమిత్‌కుమార్, కలెక్టర్, పాడేరు

జగనన్నతోనే పేదల ఆర్థికాభివృద్ధి

- అధికార దాహంతోనే చంద్రబాబు తప్పుడు హామీలు
- రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి
- రూ.6.97 కోట్ల విలువైన ఆసరా చెక్కు పంపిణీ


ఆసరా చెక్కును అందజేస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి

ఎటపాక: జగనన్న పాలనోనే పేదల ఆర్థిక అభివృద్ధి సాధ్యమని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. బుధవారం నెల్లిపాకలో డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా చెక్కును అందజేశారు. నాలుగో విడతలో మండలంలోని 926 సంఘాల్లోని 8843 మందికి రూ.6.97కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. టీడీపీ పాలనలో డ్వాక్రా సంఘాలను అప్పుల ఊబిలోకి చంద్రబాబు నెట్టారని విమర్శించారు.అక్క,చెల్లెమ్మలకు ఇచ్చిన హామీకోసం నాలుగు విడతల్లో రూ.24కోట్ల మేర రుణ మాఫీ చేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. నాడు జన్మభూమి కమిటీల పెత్తనంతో పేదలు ఇబ్బందులు పడగా, నేడు వలంటీర్లు ఇంటికి వచ్చి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని చెప్పారు. పేదలు ఆర్థికంగా బలోపేతం కావాలనే ఉద్దేశంతో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగిస్తుందన్నారు. అర్హులైన ప్రతీ పేదలకు పథకాలు ఇస్తున్నామని ఇకముందు కూడా అవినీతికి తావులేకుండా రాష్ట్రాభివృద్ధికి జగనన్న కట్టుబడి ఉన్నారన్నారు. అనంతరం నెల్లిపాక, గౌరిదేవిపేట, లక్ష్మీపురం పీహెచ్‌సీల భవనాలను ఆమె ప్రారంభించారు. ఎంపీపీ కాక కామేశ్వరి, ఎంపీడీవో మురళీకృష్ణ, ఏపీఎం స్వామి, ఎంపీటీసీలు బూరం అంజలి, వర్సా బాలకృష్ణ, వెంకటరామిరెడ్డి, కమల, సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తానికొండ వాసు, ఉపాధ్యక్షులు ఆకుల వెంకటరామారావు,పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి దామెర్ల రేవతి పాల్గొన్నారు.

వ్యక్తిపై కత్తితో దాడి

- పాత కక్షల నేపథ్యంలో ఘటన
- పరిస్థితి విషమం.. కేజీహెచ్‌కు తరలింపు


ముంచంగిపుట్టు ఏరియా ఆస్పత్రిలో శివన్నకు వైద్యం అందిస్తున్న సిబ్బంది

పెదబయలు: మండలంలోని పోయిపల్లి పంచాయతీ లగిశపల్లిలో పాతకక్షల నేపథ్యంలో కత్తితో జరిపిన దాడిలో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పరిస్థితి విషమంగా ఉన్నందున విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. ప్రత్యక్షసాక్షులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. లగిశపల్లి గ్రామానికి చెందిన పాతుని శివన్న (43) మంగళవారం రాత్రి భోజనం తరువాత ఇంటి వరండాలో పడుకున్నాడు. ఇదే సమయంలో పక్క గ్రామానికి చెందిన వరుసకు తమ్ముడు అయిన పాతుని పొట్టన్న రాత్రి 9.30 గంటల ప్రాంతంలో శివన్నపై కత్తితో దాడికి పాల్పడ్డాడు. గొంతు, ముఖం భాగాల్లో నరకడంతో కేకలు వేశాడు. వెంటనే అక్కడికి వచ్చిన చుట్టుపక్కల వారు 108లో ముంచంగిపుట్టు ఏరియా ఆస్పత్రికి తరలించారు. నిందితుడు పొట్టన్న దాడి చేసిన వెంటనే అక్కడి నుంచి వెళ్లిపోయాడు.శివన్నను మెరుగైన వైద్యం నిమిత్తం అక్కడి నుంచి పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్నందున అక్కడిని విశాఖ కేజీహెచ్‌కు తీసుకువెళ్లినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. దీనిపై ఎస్ఐ పి.మనోజ్‌కుమార్‌ను వివరణ కోరగా కేసు నమోదు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు.

16న రథసప్తమి వేడుకలు

సింహాచలం: లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ప్రాంగణంలో ఈ నెల 16న రథసప్తమి వేడుకలు నిర్వహించనున్నట్లు ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. మంగళాశాసనం తరువాత ఉదయం 7 గంటలకు స్వామివారి ఉత్సవమూర్తులను ప్రధాన దేవాలయ ప్రాకారంలోని రాతి రథం మీదకు తీసుకువచ్చి విశేష అభిషేకాలు చేస్తామన్నారు. అనంతరం నిత్యం కల్యాణం 10 గంటలకు జరుగుతుందన్నారు. 12.30 నుంచి భక్తులకు స్వామివారి దర్శనం కల్పిస్తామని చెప్పారు. సాయంత్రం 5 గంటల నుంచి స్వామివారి తిరువీధి ఉత్సవం జరుగుతుందని వివరించారు. కృష్ణాపురం గోశాలలో నిర్మించిన సూర్యభగవానుడి విగ్రహం వద్ద రథసప్తమి వేడుకలు ఉదయం 8 నుంచి ప్రారంభమవుతాయని ఈవో పేర్కొన్నారు.

సంక్షేమం, ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, వేదికపై విప్ ధర్మశ్రీ


సమావేశానికి హాజరైన జెడ్పీటీసీలు, సభ్యులు

ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర

మహారాణిపేట (విశాఖ): ప్రజాసంక్షేమం, ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యమివ్వాలని ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర ఆదేశించారు. స్థానిక జెడ్పీ సమావేశ మందిరంలో ఆమె అధ్యక్షతన బుధవారం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ కార్యాలయాలకు, ఆస్పత్రులకు వచ్చే ప్రజలను గౌరవిస్తూ పారదర్శకంగా సేవలు అందించాలని ఆమె సూచించారు. జల్‌జీవన్ మిషన్ పనులను సక్రమంగా నిర్వహించాలని, సత్ఫలితాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారవర్గాలను ఆదేశించారు. పనుల ప్రగతి వివరాలను గ్రామ పరిధిలోని నోటీసు బోర్డుల్లో అందుబాటులో ఉంచాలని సూచించారు. సోలార్ విద్యుత్ మోటార్లు, గృహ నిర్మాణాల పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యాహక్కు చట్టం ప్రకారం 25 శాతం సీట్లు పేదల పిల్లలకు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని, దీనిపై విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. గ్రంథాలయాలకు చెల్లించాల్సిన సెస్సు చార్జీలను త్వరితగతిన చెల్లించాలని ఆయా శాఖల అధికారులకు జెడ్పీ చైర్‌పర్సన్ సూచించారు. అనంతరం సభ్యులు సమావేశం దృష్టికి పలు సమస్యలు తీసుకువచ్చారు. జల్‌జీవన్ మిషన్‌లో చేపట్టిన పనులు నిరుపయోగంగా ఉన్నాయని వారు ధ్వజమెత్తారు. పనులు జరిగిన గ్రామాల్లో తాగునీరు పూర్తిస్థాయిలో అందించలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పనులు ఎక్కడా సక్రమంగా జరగలేదని, ఎక్కడ పడితే అక్కడ గోతులు తవ్వి వదిలి వేశారని జెడ్పీటీసీలు బాలయ్య పోతురాజు, ఆర్.మత్స్యలింగం, సుర్ల వెంకట గిరిబాబు ఆరోపించారు. కుళాయిల ఏర్పాటుకు లబ్ధిదారుల నుంచి నగదు వసూలు చేస్తున్నారని గొలుగొండ జెడ్పీటీసీ సుర్ల వెంకట గిరిబాబు తెలిపారు. పక్కా గృహాల మంజూరులో అధికారుల తీరు సక్రమంగా లేదని జెడ్పీటీసీ సభ్యులు దొండా రాంబాబు, సుర్ల వెంకట గిరిబాబు, పైలా సన్యాసిరాజు ఆవేదన వ్యక్తం చేశారు.మన్యంలో కిడ్నీ వ్యాధులను అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన పలువురు జెడ్పీటీసీలు కోరారు. అనకాపల్లి ఆస్పత్రిలో పోస్టుమార్టానికి మృతుల కుటుంబ సభ్యుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని , దీనిపై విచారణ చేయాలని సభ్యులు కోరారు. మన్యం ప్రాంతాల్లో రోగులను విజయనగరం కాకుండా విశాఖ తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు సేవలను గుర్తించి రాజ్యసభ టిక్కెట్ కేటాయించడంపై హర్షం వ్యక్తం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలుపుతూ సర్వసభ్య సమావేశంలో తీర్మానం చేశారు. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ , జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జెడ్పీ సీఈవో సీఈవో ఎం.పోలినాయుడు, అనకాపల్లి జిల్లా డీఆర్వో దయానిధి పాల్గొన్నారు.

సౌకర్యాలు కల్పించాలని గిరిజనుల నిరసన


జిల్లా పరిషత్ ఎదుట గిరిజనులు ప్రదర్శన

మన్యంలో సౌకర్యాలు కల్పించాలని గిరిజనులు డిమాండ్ చేశారు. అడ్డాకులు ధరించి కాగడా.. డోలీతో నిరసన తెలిపారు. జెడ్పీ సమావేశం జరుగుతుండగా కార్యాలయం ఎదుట అదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు కె.గోవిందరావు ఆధ్వర్యంలో గిరిజనులు మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు.

జనావాసంలోకి చుక్కల జింక

- కుక్కల దాడి నుంచి రక్షించిన స్థానికులు
- వైద్యం అందించిన అటవీశాఖ అధికారులు




జనావాసంలోకి వచ్చిన జింక, స్వాధీనం చేసుకున్న అటవీశాఖ అధికారులు, సిబ్బంది

రాజవొమ్మంగి: జనవాసంలోకి వచ్చి కుక్కల దాడిలో గాయపడిన చుక్కల జింకకు అటవీశాఖ అధికారులు వైద్యం అందించి రక్షణ కల్పించారు. అప్పలరాజుపేట అటవీ ప్రాంతం నుంచి అదే గ్రామంలోకి బుధవారం చుక్కల జింక వచ్చింది. దానిపై కుక్కలు దాడి చేయడంతో వాటినుంచి జింకను కాపాడిన గ్రామస్తులు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. హుటాహుటిన అక్కడకు చేరుకున్న అటవీశాఖ అధికారులు కుక్కల దాడిలో గాయపడిన జింకకు సపర్యలు చేశారు. పశువైద్య సిబ్బంది గాయాలకు మందువేసి చికిత్స అందించారు. స్థానిక అటవీ క్షేత్రాధికారి సెహన్నా అటవీశాఖ కార్యాలయానికి తరలించారు. పూర్తిగా తేరుకున్న తరువాత అటవీప్రాంతంలో విడిచిపెడతామని చెప్పారు. జింకను కాపాడిన స్థానిక గిరిజనులను ఆయన అభినందించారు. ఎఫ్ఎస్‌వోలు రాము, అర్జున్, ఎఫ్‌బీవో ప్రసాద్, రైటర్ మధు, వెటర్నరీ అసిస్టెంట్ ఏసుబాబు, పాఠశాల హెచ్‌ఎం వెంకటేశ్వర్రావు, సిబ్బంది లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

పవర్ ప్రాజెక్టుపై పుస్తకం అందజేత



హైడల్ డైరెక్టర్ సత్యనారాయణకు పుస్తకాన్ని అందజేస్తున్న ఈఈ లక్ష్మీనారాయణ

సీలేరు: సీలేరు జల్ విద్యుత్ కేంద్రం నిర్వహణ, పనితీరుపై, విద్యుత్ ఉత్పత్తి, స్థితిగతులు, యూనిట్‌లో చేపట్టే ఆయిలింగ్ పనులు, రిపేర్ వర్క్స్ తదితర అంశాలపై యూనిట్ ఈఈ లక్ష్మీనారాయణ పుస్తకాన్ని రచించారు. 'ఏ రిపోర్ట్ ఆన్ ఓవర్ ఆయిలింగ్ ఆఫ్ యూనిట్-4 (60 మెగావాట్ హైడ్రో పవర్ ప్రాజెక్టు అప్పర్ సీలేరు)' పేరుతో రచించిన పుస్తకాన్ని హైడల్ డైరెక్టర్ సత్యనారాయణ, హెచ్‌పీసీ చీఫ్ ఇంజినీరు సుజయ్ కుమార్, సీజీఎం ఎం.గౌరీపతి, జెన్‌కో ట్రైనింగ్ చీఫ్ ఇంజినీరు నాగభూషణం తదితరులకు ఆయన బుధవారం అందజేశారు. ప్రాజెక్టు మెయింటినెన్స్‌పై రచించిన ఈ పుస్తకం ఎంతగానో ఉపయోగపడుతుందని పలువురు చెప్పారు.

పురుగు మందు తాగిన మహిళ మృతి

సీలేరు: కొడుకు కొట్టాడన్న మనస్తాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన కొర్రా పొట్టి ఫాతిమా (58) అనే గిరిజన మహిళ నర్సీపట్నం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. దుప్పులవాడ పంచాయతీ పిల్లి గెడ్డ గ్రామంలో మంగళవారం ఉదయం అన్నం వండి పెట్టలేదని కోపంతో ఫాతిమాను కొడుకు కొట్టాడు. తరచూ ఇలాగే చేస్తున్నాడన్న మనస్తాపంతో ఆమె పురుగుల మందు తాగింది. గమనించిన బంధువులు సీలేరులో వైద్యం అందించి, మెరుగైన వైద్యం కోసం నర్సీపట్నం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి, మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించినట్టు వారు చెప్పారు.

రికవరీ ఆఫీసర్-II వారి కార్యాలయం
డెట్స్ రికవరీ ట్రిబ్యునల్
భారత ప్రభుత్వము, ఆర్థిక మంత్రిత్వ శాఖ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ (బ్యాంకింగ్ విభాగం)
31-31-21, గ్రౌండ్ & 1వ అంతస్తు, నారాయణ భవనం, సాయిబాబా వీధి, దాబాగార్డెన్స్, విశాఖపట్నం-530020, ఎ.పి.
ఫోన్: 0891-2957045, ఇ-మెయిల్: ro2.drtvpatnam@gmail.com
RP/818/2019 in OA/544/2018
కెనరా బ్యాంక్, సిరిపురం బ్రాంచ్, విశాఖపట్నం
వర్సెస్
శ్రీమతి కేలాని రాజ రాజేశ్వరి మరియు ఇతరులు
విషయము: ఇ-వేలం అమ్మకం వాయిదా ప్రకటన
06.01.2024 ... https://www.bankeauctions.com ... 16.02.2024 ... 11.03.2024 ... 06.03.2024 ... 07.03.2024 ... 06.01.2024 ...
విశాఖపట్నం వద్ద తేది 14 02 2024 న జారీచేయడమైనది
(డి.ఎన్.ఎస్.వి.ఎస్.కె. ...) రికవరీ ఆఫీసర్

రైతుల శ్రేయస్సే లక్ష్యం!

- నేడు డీసీసీబీ మహాజన సభ
- 2024-25 వార్షిక బడ్జెట్‌పై చర్చ
- ఉమ్మడి విశాఖ జిల్లాలో 30 బ్రాంచీల ద్వారా కార్యకలాపాలు
- మరో 13 కొత్త బ్రాంచీల ఏర్పాటుకు కసరత్తు



విశాఖ మర్రిపాలెంలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయం

విశాఖ విద్య: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తున్న నేపథ్యంలో రైతులకు తోడ్పాటు అందించేలా జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) పక్కా ప్రణాళికతో ముందుకెళ్లోంది. రైతుల శ్రేయస్సే ప్రధాన అజెండాతో గురువారం జరగనున్న మహాజన సభలో 2024-25 వార్షిక బడ్జెట్‌పై చర్చించనున్నారు. నగరంలోని మర్రిపాలెంలో ఉన్న డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం 3 గంటలకు బ్యాంక్ చైర్‌పర్సన్ కోలా గురువులు అధ్యక్షతన మహాజన సభ నిర్వహించేందుకు బ్యాంకు అధికారులు అంతా సిద్ధం చేశారు.

తక్కువ వడ్డీకే రుణాలు

- డిసెంబర్ మాసాంతం వరకు బ్యాంకులో అన్ని రకాల డిపాజిట్లు కలిపి రూ.883.94 కోట్లు ఉన్నాయి. ప్రభుత్వం, నాబార్డు నిర్దేశించిన వడ్డీ రేటుకు అనుగుణంగా ప్రాధాన్యత రంగాలకు రుణాలు మంజూరు చేస్తున్నారు.
- 2023-24 సంవత్సరంలో ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు 20,005 మంది సభ్యులకు పంట రుణాల రూపేణా రూ.127.68 కోట్లు, అదే విధంగా అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు 7,694 మందికి రూ.53.72 లక్షలు ఇచ్చారు.
- వ్యవసాయ యాంత్రీకరణకు తోడ్పాటు అందించేలా కస్టమ్ హైరింగ్ కేంద్రాల(సీహెచ్‌సీ)కు ఈ ఆర్థిక సంవత్సరంలో డిసెంబర్ మాసాంతం వరకు 208 గ్రూపులకు రూ.4.56 కోట్లు మంజూరు చేశారు.
- స్వయం సహాయక సంఘాల బలోపేతం కోసమని బ్యాంకు ద్వారా ఈ ఆర్థిక సంవత్సరంలో డిసెంబర్ మాసాంతం వరకు 724 గ్రూపులకు రూ.39.13 కోట్లు రుణాలు మంజూరు చేశారు.
- బ్యాంకు ద్వారా సేవలు పొందుతున్న సభ్యుల్లో 75,757 మంది రైతులకు కిసాన్ రూపే కార్డులు జారీ చేశారు.

కొత్త బ్రాంచీలతో వ్యాపార విస్తరణ

జిల్లా కేంద్ర సహకార బ్యాంకు విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల పరిధిలోని 30 బ్రాంచీలు, వాటి పరిధిలోని 98 వ్యవసాయ పరపతి సంఘాల ద్వారా కార్యకలాపాలు కొనసాగిస్తోంది. బ్యాంకు అభివృద్ధిలో భాగంగా కొత్త బ్రాంచీల ఏర్పాటుపై అధికారులు దృష్టి సారించారు. విశాఖ జిల్లాలో 2, అనకాపల్లిలో 9, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 2 బ్రాంచీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. విశాఖ జిల్లాలోని పద్మనాభం, ఆనందపురంలో బ్రాంచీల ఏర్పాటుకు రిజర్వ్ బ్యాంకు నుంచి ఇప్పటికే అనుమతులు వచ్చాయి. వీటిని త్వరలోనే ప్రారంభించేలా బ్యాంకు అధికారులు సన్నద్ధమవుతున్నారు.

బ్యాంకుల కంప్యూటరీకరణ

డీసీసీబీ ఆధ్వర్యంలో అవసరమైన చోట్ల ఏటీఎం కేంద్రాలను ఏర్పాటు చేశారు. కేంద్ర సహకార మంత్రిత్వశాఖ సూచనలకు అనుగుణంగా కంప్యూటరీకరణ, సైబర్ సెక్యూరిటీ, భవిష్యత్ అవసరాల మేరకు డేటా స్టోరేజీలో భాగంగా అంతా డిజిటలైజేషన్ చేస్తున్నారు. ఇందు కోసం ఒక్కో బ్రాంచికి రూ.3.91 లక్షల ఖర్చుతో డిజిటిలైజేషన్ పనులు చేపట్టారు.

అందరి సమన్వయంతో అభివృద్ధి



ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా రైతులకు తోడ్పాటు అందిస్తూనే, బ్యాంకు అభివృద్ధి కోసమని వ్యాపార విస్తరణపై దృష్టి పెట్టాం. రుణాల రికవరీ లక్ష్యం మేరకు సాగితేనే బ్యాంకు అభివృద్ధికి దోహదపడుతుంది. ఆ దిశగా అంతా సమన్వయంతో పని చేస్తున్నాం. దీనిపై మహాజన సభలో సభ్యులందరి ఆమోదంతో 2024-25 వార్షిక బడ్జెట్‌కు అనుగుణంగా కార్యకలాపాలు కొనసాగిస్తాం

– డి.వి.ఎస్.వర్మ, సీఈవో, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు

సిలబస్ పూర్తి చేయకపోవడంపై పీవో ఆగ్రహం

ఆశ్రమ పాఠశాలల తనిఖీ



రంపఎర్రంపాలెం ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులతో మాట్లాడుతున్న పీవో సూరజ్‌గనోరే

రంపచోడవరం: సకాలంలో సిలబస్ పూర్తి చేయకపోవడంపై రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలను బుధవారం సాయంత్రం ఆయన సందర్శించారు. దీనిలో భాగంగా ముందుగా ఊట్ల ఆశ్రమ పాఠశాలను సందర్శించి ఆయన విద్యార్థులతో మాట్లాడారు. ఈ ఏడాదికి సంబంధించి సిలబస్ పూర్తి చేయకపోవడంపై పీవో అగ్రహం వ్యక్తం చేశారు .ఎర్రంపాలెం ఆశ్రమ పాఠశాలలో కూడా ఇదే పరిస్థితి ఉండటంతో ఉపాధ్యాయుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారం అందించాలని ఆదేశించారు. టెండరుదారులు ఆశ్రమ పాఠశాలలకు సకాలంలో కూరగాయలు, చికెన్ సరఫరా చేస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు.స్టోర్ రూమ్‌ను తనిఖీ చేశారు. సిలబస్‌ను పూర్తి చేయడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట డీడీ అబ్బలోం ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ వైపే ప్రజల మొగ్గు

- పార్టీ పాడేరు నియోజకవర్గ సమన్వయకర్త విశ్వేశ్వరరాజు
- మాజీ సర్పంచ్, ఎంపీటీసీతో సహా పలువురు పార్టీలో చేరిక



పార్టీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న పాడేరు నియోజకవర్గ సమన్వయకర్త విశ్వేశ్వరరాజు

పాడేరు : రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ క్లీన్ స్వీప్ చేయడం ఖాయమని వైఎస్సార్‌సీపీ పాడేరు నియోజకవర్గ సమన్వయకర్త మత్స్యరాస విశ్వేశ్వరరాజు అన్నారు. మండలంలోని బర్సింగి గ్రామ పంచాయతీలో బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌కు చెందిన మాజీ సర్పంచ్ పాంగి సత్తిబాబు, సీపీఐకు చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యుడు బోయిని సింహాద్రి, మరో 20 కుటుంబాలు ఆయన సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరరాజు మాట్లాడుతూ ప్రజలకు మేలు చేసే వైఎస్సార్‌సీపీకి అన్ని వర్గాల మద్దతు ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు రానున్న ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి సోపానాలని ఆయన పేర్కొన్నారు. సంక్షేమ పథకాలు మరింతగా అందాలంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ఓటు వేసి గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో పాడేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూతంగి సూరిబాబు, సర్పంచ్‌లు బోయిన చిట్టిబాబు, కుర్రబోయిన సన్నిబాబు, వంతాల రాంబాబు, గబ్బాడ చిట్టిబాబు, ఎంపీటీసీ సభ్యుడు కుంతూరు నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత

- పాడేరు సీఐ నవీన్‌కుమార్
- ఆర్టీసీ డ్రైవర్లకు సన్మానం



ఆర్టీసీ డ్రైవర్లను సన్మానిస్తున్న పాడేరు సీఐ నవీన్‌కుమార్

పాడేరు : రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పాడేరు సీఐ నవీన్‌కుమార్ అన్నారు. 35వ రాష్ట్ర రోడ్డు, రవాణ భద్రత వారోత్సవాలను బుధవారం పాడేరు ఆర్టీసీ డిపో ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఉత్తమ ఆర్టీసీ డ్రైవర్లకు ఘనంగా సన్మానించారు. పాడేరు ఆర్టీసీ డిపోలో డ్రైవర్లుగా పనిచేస్తున్న ప్రమాదరహిత డ్రైవర్లుగా ఎంపికైన కె.కె.బాబుకు మొదటి బహుమతి, డీఎస్ రావుకు రెండో బహుమతి, వీసీహెచ్ రావుకు మూడో బహుమతులను అందజేసి దుశ్శాలువలు కప్పి ఘనంగా సన్మానించారు. వీరిని డిపోలో పనిచేస్తున్న మిగిలిన డ్రైవర్లు ఆదర్శంగా తీసుకొని ప్రయాణికులను సుతక్షితంగా గమ్యస్థానాలని చేర్చేలా పని చేయాలని సూచించారు. డీపీటీవో వేదుల శ్రీనివాసరావు, ఆఫీస్ ఇన్‌చార్జి డి.వి.శ్రీనివాస్, ట్రాఫిక్ ఇన్‌చార్జి డి.అప్పారావు, గ్యారేజ్ మెకానికల్ ఇంజినీర్ విరమణ, ఆర్టీసీ యూనియన్ నాయకులు గంగాధరరావు, చలం, బీకే రావు, చందు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వసంత పంచమి పూజలు



దూసరపాము ఆలయంలో చిన్నారుల అక్షరాభ్యాసం



సీలేరు డీఏవీ స్కూల్‌లో సరస్వతి పూజ చేస్తున్న విద్యార్థులు



పవనగిరి క్షేత్రంలో సరస్వతి అమ్మవారు

అడ్డతీగల: వసంత పంచమి పురస్కరించుకుని భక్తిశ్రద్ధలతో సర్వసతీ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పవనగిరి క్షేత్రంలో కొలువైన సరస్వతి అమ్మవారికి విశేష అర్చన పూజలు చేశారు. అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకులు తణుకు వెంకటరామయ్య ఆధ్వర్యంలో అభిషేకాలు, పూజలు, కుంకుమార్చన జరిపారు. రుషిపీఠం వద్ద సరస్వతి అమ్మవారి బీజాక్షరాలతో కూడిన మంత్ర హోమం నిర్వహించారు. ఈ పర్వదినం నాడు పిల్లలకు అక్షరాభ్యాసం చేయడం వల్ల శుభపరిణామమే కాకుండా మేథోశక్తి కలుగుతుందన్నారు. భక్తులకు అన్నప్రసాద వితరణ గావించారు.

రాజవొమ్మంగి: వసంత పంచమి పురస్కరించుకుని మండలంలోని దూసరపాము గ్రామంలోని దుర్గామాత దేవాలయంలో సరస్వతి దేవికి బుధవారం వసంత పంచమి పూజలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా 25 కుటుంబాల వారు తమ చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఆలయాల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. షిర్డీ సాయి మందిరంలో సరస్వతిదేవికి వసంత పంచమి సందర్భంగా పూజలు జరిగాయి.

సీలేరు: వసంత పంచమి పురస్కరించుకుని ఏపీ జెన్‌కో డీఏవీ పాఠశాలలో సరస్వతి దేవికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్స్‌పాల్ నాగ నమఃశివాయ , అర్చకుడు భాస్కర్ మాస్టారు, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులంతా అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు.

చలి చంపేస్తోంది

- కొనసాగుతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు
- చింతపల్లిలో 7.5, మినుములూరులో 10, అరకులో 12.1 డిగ్రీల నమోదు

సాక్షి,పాడేరు: మన్యంలో కనిష్ట ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి. పొగమంచు తీవ్రత లేనప్పటికి రాత్రి, ఉదయం సమయంలో చలిగాలుల ప్రభావం ఎక్కువగా ఉంది. తేలికపాటి మంచు కురుస్తుండగా,సూర్యోదయం వేగంగానే ఆవుతోంది. మధ్యాహ్న సమయంలో ఎండతీవ్రత నెలకొంది. చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 7.5 డిగ్రీలు, మినుములూరులో 10 డిగ్రీలు, అరకులోయ కేంద్ర కాఫీబోర్డు వద్ద 12.1డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు బుధవారం నమోదయ్యాయి.

ఆశ్రమ విద్యార్థుల మరణాలకు పీవోలదే బాధ్యత

- మావోయిస్టు పార్టీ ఉమ్మడి జిల్లా కార్యదర్శి అరుణ

సాక్షి,పాడేరు: జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలలో వరుసగా విద్యార్థులు అనారోగ్యంతో మృతి చెందుతున్నారని ఇందుకు బాధ్యత వహిస్తూ రంపచోడవరం, పాడేరు ఐటీడీఏ పీవోలను సస్పెండ్ చేయాలని మావోయిస్టు పార్టీ ఉమ్మడి విశాఖ జిల్లా కార్యదర్శి అరుణ డిమాండ్ చేశారు. ఈమేరకు ఈమె పేరిట బుధవారం రాత్రి ఒక లేఖ విడుదల అయింది. ఈనెల రోజుల వ్యవధిలో నలుగురు గిరిజన విద్యార్థులు మృతి చెందడం బాధాకరమని పేర్కొన్నారు. వసతి గృహాల్లో విద్యార్థులకు సరైన పౌష్టికాహారం, మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆమె డిమాండ్ చేశారు. విద్యార్థులను కోల్పోయిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ నష్ట పరిహారం చెల్లించాలని ఆమె కోరారు.

మిలాన్-2024 పై సీపీ సమీక్ష



నేవీ, పోలీసు అధికారుల సమీక్ష సమావేశంలో పాల్గొన్న సీపీ డాక్టర్ రవిశంకర్

అల్లిపురం: ఈ నెల 19 నుంచి 27వ తేదీ వరకు రెండు ఫేజ్‌లుగా బీచ్‌రోడ్డులో నిర్వహిస్తున్న మిలాన్-2024పై నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఏ.రవిశంకర్ బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. సూర్యాబాగ్‌లోని పోలీస్ కమిషనరేట్‌లో జరిగిన సమావేశంలో మిలాన్-2024 సందర్భంగా నగరానికి ఉపరాష్ట్రపతి, కేంద్ర రక్షణ శాఖ మంత్రి, రాష్ట్ర ముఖ్యమంత్రితో పాటు పలువురు వీఐపీలు, వీవీఐపీలు వచ్చే అవకాశం ఉన్నందున భద్రతపై చర్చించారు. ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న మిలాన్-2024ను విజయవంతం చేయాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ సమావేశంలోజాయింట్ సీపీ కె.ఫకీరప్ప, డీసీపీ -1 వీఎస్ మణికంఠ చందోల్, డీసీపీ క్రైం పి.వెంకటరత్నం, నేవీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

16న మెగా జాబ్‌మేళా

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో శుక్రవారం మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సీహెచ్ సుబ్బిరెడ్డి (క్లరికల్) తెలిపారు. అరబిందో స్పైసెస్, జాబ్ డీలర్స్, రాయల్ ఎన్ ఫీల్డ్, సాయి కెమికల్స్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్, హరీష్ ఫుడ్ బేవరేజెస్, హెటిరో డ్రగ్స్ శ్రీరామ ఫైనాన్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో 555 ఉద్యోగాలు భర్తీ చేయనున్నారు. సర్వీస్ అడ్వైజర్ టెక్నీషియన్, జూనియర్ కెమిస్ట్, రిటైల్ ట్రెనింగ్ అసోసియేట్, ఫార్మసిస్ట్, జూనియర్ ట్రైనీ, డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్స్, ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటీవ్స్, ఆఫీస్ అసిస్టెంట్, అకౌంట్స్, అసిస్టెంట్, రికవరీ క్లర్కు, బ్రాంచ్ ఇంచార్జ్ ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీ, పీజీ, ఎం.ఫార్మసీ ఉత్తీర్ణత సాధించిన 18-42 సంవత్సరాల వయసు కల్గిన పురుష, మహిళా అభ్యర్థులు అర్హులన్నారు. ఆయా ఉద్యోగాల బట్టి జీతం నెలకు రూ10 వేలు నుంచి రూ.18,500ల వరకు ఉంటుందన్నారు. కంచరపాలెం జిల్లా ఉపాధి కార్యాలయంలో శుక్రవారం 10 గంటలకు జాబ్‌మేళాకు హాజరుకావాలని ఆయన కోరారు.

హామీలన్నీ అమలు చేసిన ఘనత జగనన్నకే సొంతం

- సుపరిపాలన అందిస్తున్న వైఎస్సార్‌సీపీకి అండగా నిలవాలి
- రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి



రేఖపల్లి పీహెచ్‌సీ నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి



వైఎస్సార్ ఆసరా చెక్కును డ్వాక్రా మహిళలకు అందజేస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

వీఆర్‌పురం: ఇచ్చిన మాటకు కట్టుబడి సంక్షేమ పథకాలను అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. మండలంలోని రేఖపల్లిలో గ్రామంలో వెలుగు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన నాలుగో విడత ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. డ్వాక్రా సంఘ సభ్యులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి మాట్లాడుతూ డ్వాక్రా గ్రూపుల ద్వారా బ్యాంకుల్లో రుణాలు తీసుకుని వాటిని ప్రతి నెలా అధిక వడ్డీలను, పెరుగుతున్న అప్పులను కట్టలేక గతంలో మహిళలు ఇబ్బందులు పడేవారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మహిళలకు రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చి అమలు చేయకుండా డ్వాక్రా మహిళలను మోసం చేశాడని విమర్శించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్ప పాదయాత్రలో మహిళలకు రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చి.. అధికారంలోకి వచ్చిన తరువాత రుణ మాఫీ చేసి డ్వాక్రా మహిళల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. ఎన్నికల హామీలన్నీ అమలుచేసిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. వీఆర్ పురం మండలంలోని 2069 మంది డ్వాక్రా మహిళలకు నాలుగు విడతల్లో రూ.2.60 కోట్లను ప్రభుత్వం అందజేసిందన్నారు. లబ్ధిదారులకు వ్యవసాయ పరికరాలను అందచేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటిని అమలుచేసిన సీఎం జగనన్నకు అందరూ అండగా నిలుద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి ముందు రాజుపేట, రేఖపల్లి సచివాలయ నూతన భవనాలను ఆమె ప్రారంభించారు. తహసీల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్, ఎంపీడీవో ఆర్.ఫణీంద్రరెడ్డి, ఏపీఎం కిషోర్, ఎంపీపీ కారం లక్ష్మీ, జెడ్పీటీసీ సభ్యుడు వాళ్ల రంగారెడ్డి, వైస్ ఎంపీపీ ముత్యాల గంగాభవాని, మండల పార్టీ కన్వీనర్ మాదిరెడ్డి సత్తిబాబు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు చిక్కాల బాలు, సర్పంచ్‌లు పిట్టా రామారావు, వడ్డానపు శారద, మూట్ల బాలరాజు, ఉప సర్పంచ్ రాము, నాయకులు శ్రీనివాస్, గంగులు, మురళి, గౌతమ్, వెంగళరావు, రాజు, బాలాజీ, నరేష్, ఉమ, రాజేష్, ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ పాలనలోనే పేదలకు కార్పొరేట్ వైద్యం

వీఆర్ పురం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలోనే రాష్ట్రంలో పేదలందరికీ కార్పొరేట్ వైద్యం అందుతోందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. మండలంలోని రేఖపల్లిలోని నూతన పీహెచ్‌సీ కేంద్రాన్ని ఆమె బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పేదలకు వైద్యం అందని ద్రాక్షగా ఉండేదని, సకాలంలో వైద్య సేవలందక ప్రజలు తీరని ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యతో పాటు వైద్యంపై దృష్టి సారించి ప్రతీ పేదవాడికి పూర్తిస్థాయిలో కార్పొరేట్ వైద్యం అందేలా ప్రణాళికలు అమలుచేశారన్నారు. ఇందులో భాగంగా సకాలంలో వైద్యం అందించేలా ప్రతీ మండలానికి రెండు అంబులెన్స్‌లు చొప్పున ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ప్రతీ మండలంలో నూతన ఆస్పత్రి భవనాలని నిర్మించడం జరిగిందన్నారు. ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ పుల్లయ్య, వైద్యాధికారి అనిల్‌కుమార్, తహసీల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్, ఎంపీడీవో ఆర్.ఫణీంద్రరెడ్డి, ప్రజా ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అయోధ్యకు 'ఆస్థా' పయనం



రైల్వేస్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న అయోధ్య భక్తులు



అయోధ్య ప్రయాణికులతో కిక్కిరిసిన ప్రధాన గేట్

తాటిచెట్లపాలెం : అయోధ్య బాల రాముని దర్శనం కోసం భారతీయ రైల్వే ఏర్పాటు చేసిన 'ఆస్థా' ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు విశాఖపట్నం నుంచి రామభక్తులతో బుధవారం రాత్రి బయల్దేరింది. ఈ సందర్భంగా భక్తులకు వీడ్కోలు పలుకుతూ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు పలు సూచనలు చేశారు. మళ్లీ విశాఖకు వచ్చే వరకు అన్నీ ట్రస్ట్ సభ్యులు, ఐఆర్‌సీటీసీ సభ్యులు చూసుకుంటారని ఆయన తెలిపారు. ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో అయోధ్య రామమందిర్ ట్రస్ట్ సహాయంతో ఈ ఆస్థా స్పెషల్ రైళ్లు నడుపుతున్నారు. రాష్ట్రం నుంచి అయోధ్యకు బయల్దేరుతున్న మూడో రైలు ఇది. విశాఖపట్నం నుంచి బయల్దేరిన మొదటి రైలు ఇదే. విశాఖపట్నం-అయోధ్య(08572) ఆస్థా స్పెషల్ బుధవారం రాత్రి 10.20 గంటలకు విశాఖపట్నంలో బయల్దేరి ఈ నెల 16వ తేదీ శుక్రవారం ఉదయం 10.35 గంటలకు అయోధ్య ధాం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో అయోధ్య-విశాఖపట్నం(08572) ఆస్థా స్పెషల్ 17వ తేదీ శనివారం రాత్రి 7.55 గంటలకు అయోధ్య ధాంలో బయల్దేరి సోమవారం ఉదయం 9.15 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ రైలు మొత్తం 20 స్లీపర్ క్లాస్ కోచ్‌లతో బయల్దేరింది. విశాఖపట్నం నుంచి మొత్తం 1100 మంది బయల్దేరగా, విజయనగరం నుంచి మరో 300 మంది ఈ రైలులో అయోధ్యకు వెళ్లనున్నారు. అలాగే విశాఖపట్నం నుంచి ఈ నెల 19, 28వ తేదీల్లో మరో రెండు రైళ్లు బయల్దేరనున్నాయి. ఈ కార్యక్రమంలో స్టేషన్ డైరెక్టర్ వెంకటరాజు, స్టేషన్ మేనేజర్ అరుణశ్రీ, జీఆర్పీ, ఆర్పీయఫ్, రైల్వే, ఐఆర్‌సీటీసీ సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

PLOT FOR SALE
■ * భోగాపురం ఎయిర్‌పోర్టు దగ్గరలో హైవేకి ప్రక్కనే 2 కి.మీ. దూరంలో D.తాళ్ళవలస గ్రామం నందు 180 గజాల ఉదా బిట్ గజం 16 వేలకే * కొమ్మాదిలో 3 BHK 1400 St 53 లక్షలే. * 100 గజాల శ్రీగంధం ప్లాంటాండ్ 4 లక్షలే. ఫోన్: 63001 72408 [V- 2399]

Services

GOLD LOANS
■ లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 11574]

Wanted
■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్ కలవు. మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 9177736926. [M-1233790]

■ స్కూలులో పనిచేయుటకు 45 సంవత్సరాల లోపుగల ఆడ ఆయా కావలెను. N.T. స్కూల్, 80 ఫీట్ రోడ్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం-16. సెల్: 99590 94720, 98987 09459. [V-2402]

■ అనకాపల్లిలో ప్రముఖ రెడీమేడ్ గార్మెంట్ షోరూమ్‌లో పనిచేయుటకు మేనేజరు (పు) డిగ్రీ / స్టాఫ్ (10th/ఇంటర్) కావలెను. ఫోన్ : 90523 81026 [V-791077]

■ మీరు ఉన్న చోటు నుండి డిజిటల్‌గా వర్క్ చేస్తూ ప్రముఖ గ్లోబల్ కంపెనీలో అధిక ఆదాయం సంపాదించవచ్చు. (పార్ట్ / ఫుల్ టైం) 100% ఎటువంటి ఫీజులు ఉండవు. సంప్ర : 97015 05819 [V-797183]

■ సాఫ్ట్‌వేర్ కోర్సులపై ఉచిత శిక్షణ : B.Sc కంప్యూటర్స్, B.Tech కంప్యూటర్ సైన్స్ (20, 21, 22, 23 పాస్ అయిన వారు మాత్రమే) @ ద్వారకానగర్, వైజాగ్. ఫోన్ : 90003 79933, 95739 79344 [V- 5418]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ మేసేజ్‌లు పంపుతూ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్. మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 95027 12418, 90306 12463 [M-1233787]

■ Wanted Male Marketing incharges, Cashiers, Batch incharges and Female Tele callers as non teaching staff in a Reputed Educational Organisation Qualification Any Inter/Degree/PG, Age Limit: 21 to 45years. Salary:Negotiable, Working Location Gajuwaka, Vizag. 8008556073, 9989893943 [G-5063]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9573633520, 9059633520. [M-1167521]

■ హైదరాబాద్ నుండి 120 కి.మీ. దూరంలో వ్యవసాయం చేయడానికి జంటలు (భార్యాభర్తలు) ట్రాక్టర్ డ్రైవర్స్ & ఎలక్ట్రీషియన్స్ కావలెను. ఫ్రీ వసతి + భోజనం. సంప్ర: ప్రతి రోజు ఉ. 6-ఉ.9 గం॥ల వరకు. ఫోన్. 6305762058 [H-787724]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం. జీ : 18K. Ph: 9160900024, 9640400073 [HA-1223]

■ ప్రముఖ ఎయిర్‌పోర్ట్‌లో పనిచేయుటకు లోడింగ్ సూ'వైజర్స్, హౌస్ కీపింగ్ సూ'వైజర్స్, డ్రైవర్స్, కార్గో లోడర్స్,కంప్యూటర్ ఆపరేటర్స్ కావలెను. జీతం: 25000/- 35000/- రూం+భోజనం ఫ్రీ. ఫోన్. 7093789794. [H-788067]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రకటన గోరంత! స్పందన కొండంత!! సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం-16.
అనకాపల్లి :9010546644
యలమంచిలి :9951602901
చోడవరం :9010210265
నర్సీపట్నం :9010234557
పాడేరు :9010973030
విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా
నాలుగు లైన్లు రూ.475/-
అదనపు లైను రూ.100/-
+ 5% జి.ఎస్.టి. అదనం